# లక్కీ సెంటిమెంట్

ముంబాయి-పుణే హైవేలో ఓ "మారుతీ ఎస్టీమ్" పరుగులు తీస్తోంది.

కుమార్ డ్రైవ్ చేస్తున్నాడు. కారు 'పన్‌వెల్' దాటి 'లోన్‌వలా' కేసి సాగుతోంది. అందులో ఇంకా స్వామి, రెడ్డి, మూర్తి వున్నారు.

మూర్తి చార్టెడ్ ఎకౌంటెంట్, దాదర్‌లో ఆఫీసుపెట్టి సొంతగా ప్రాక్టీసు చేస్తున్నాడు. అతనుండేది మాలాడ్‌లో. స్వామి బ్యాంక్ మానేజర్. సాయన్‌లో ఉంటాడు. అతని ఆఫీసు నారిమన్ పాయింట్‌లో. రెడ్డి- డాక్టర్. చెంబూర్‌లో డిస్పెన్సరీ ఉంది. వాశీ-కొత్త

ముంబాయిలో నివాసం. ఇక కుమార్‌కు ఒ.ఎన్.జి.సి. బాంద్రా ఆఫీసులో ఉద్యోగం. తను ఇంజనీర్, కంపెనీ క్వార్టర్స్ గోరేగాంలో ఉంటున్నాడు.

నలుగురు మిత్రులు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు చెందినవారు. ఇక్కడి తెలుగు సంఘంలో సభ్యులు. అప్పుడప్పుడూ నగరానికి దూరంగా పిక్నిక్‌కి వెళుతూంటారు.వారి కామన్ ఫ్రెండ్ జగ్గీ. అతనికి లోనావలాలో ఓ బంగళా ఉంది. అక్కడికే వీరి ప్రయాణం. కేర్‌టేకర్ నామ్‌దేవ్‌కు ముందుగా ఫోన్ చేస్తే తాగడానికి, తినడానికి ఏర్పాట్లు చేస్తాడు. లోనావలా చేరేటప్పటికి సాయంకాలం ఆరున్నర. అందరూ స్నానాలు ముగించి, టిఫిన్ చేసి, ఛాయ్ తాగేసరికి ఎనిమిదయింది. నామ్‌దేవ్, మందు పార్టీ సన్నాహాలు మెరుగులు దిద్దుకుంటున్నాయి.

స్కాచ్ బాటిల్, నాలుగు గ్లాసులు, పల్లీ పకోడా, కాజా, ఆలూ చిప్స్, ఉడకబెట్టిన గుడ్లు అన్నీ నీట్‌గా సర్దాడు. సోడాలు, వాటర్ బాటిల్స్ ఓ పక్కనుంచాడు. సిగరెట్లు వెలిగించి, మాటల్లో పడ్డారు మిత్రులు. కుమార్ గ్లాసుల్లోకి వంపుతున్నాడు. అతనికదో హాబీ. ఒక్క డ్రాప్ కూడా వృథా కాకూడదంటాడు.

"స్వామి, మీ పెన్ ఇలా ఇస్తారా?" అడిగాడు రెడ్డి.

"వైనాట్, తీసుకోండి, మై లక్కీ పెన్" అంటూ అందించాడు స్వామి.

"వావ్!" అంటూ పరిశీలించి చేతిలో దాన్ని ఉంచుకునే అడిగాడు రెడ్డి - "ఏమిటంట ఆ లక్కు?"

"ఈ పెన్‌తోనే డిగ్రీ, పి.జి. ఎగ్జామ్స్ రాశాను. ప్రొబేషనరీ ఆఫీసర్ టెస్ట్, సి.ఎ.ఐ.ఐ.బి. అన్నింటిలో ఫస్ట్ ఎటెంప్ట్‌లో విజయం సాధించాను" అన్నాడు స్వామి.

"దాన్ని నేను ట్రాష్ అంటాను. నీ విజయాలకు కారణం కృషి. ఈ పెన్ను కాకపోతే ఏ అర్ధరూపాయి పెన్నుతో రాసినా పాసయ్యేవాడివి" కుమార్ రియాక్టయ్యాడు.

"అదికాదు బాబా, అది నా లక్కీ పెన్ అంటున్నాను, దట్సాల్." ఇక వాదనవసరం లేదన్నట్లు స్వామి స్పష్టం చేశాడు.

"మనం ఎంత కృషి చేసినా ఒక్కోసారి ఫలితం దక్కదు. దానికి దైవం కూడా సహకరించాలి. అదే లక్కంటే" అందుకున్నాడు రెడ్డి.

"దైవం లేదు. గాడిద గుడ్డూ లేదు. వీటిని నేను నమ్మను" అన్నాడు కుమార్.

"పోనీ సెంటిమెంటును నమ్ముతావా?" అడిగాడు మూర్తి.

"నో సెంటిమెంట్స్, ఓన్లీ డ్రింక్స్" - కుమార్.

"అదే పెద్ద సెంటిమెంట్." డాక్టర్ రెడ్డి మాటలకు కుమార్ సైతం నవ్వాడు.

" ఈ విషయంలో మీకు నా అనుభవం గుర్చి చెప్పాలి." అన్నాడు మూర్తి.

"చెప్పు, చెప్పు" అన్నారంతా.

నలుగురూ గ్లాసులు తీసుకుని ఛీర్స్ చెప్పుకున్నారు. మూర్తి చెప్పడం మొదలుపెట్టాడు.

"ఆ రోజు మా చిన్నమ్మాయి మొదటి పుట్టినరోజు. కాస్త పెందరాళే రమ్మంది శ్రీమతి. రోజూ ఏడెనిమిది గంటలకు గాని బయలుదేరని నేను ఆరోజు మూడు గంటల కల్లా బయటపడ్డాను. దాదర్‌లో ట్రైన్ ఎక్కాను. ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో రద్దీ అంతగాలేదు. నా 'పౌచ్' (బ్యాగు) పైనపెట్టి గోపీచంద్-పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా" చదవడంలో మునిగిపోయాను. పుదుచ్చేరి అరవింద ఆశ్రమం, అక్కడి ఆధ్యాత్మిక ప్రసంగాలు రసవత్తరంగా ఉన్నాయి. బండి ఆగింది. ఏ స్టేషన్ అని చూస్తే... మాలాడ్! దిగిపోయాను. స్టేషనెదురుగా 'డిల్లీవాలా' షాపులో స్వీట్లు, నమ్‌కీన్ ప్యాక్ చేయించా. అప్పుడు చూసుకుంటే చేతిలో పుస్తకం మాత్రమే ఉంది. పౌచ్ లేదు! అది ట్రెయిన్‌లోనే ఉండిపోయింది. అందులో నా రైల్వే సీజన్ టిక్కెట్, డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్ కార్డ్, దాదాపు వేయి రూపాయల రొక్కం, కొన్ని ఇంపార్టెంట్ పేపర్లు ఉన్నాయి. నాకు చెమటలు పట్టాయి. వాచీకేసి చూశాను. సరిగ్గా పదిహేను నిమిషాలయింది నేను ట్రెయిన్ దిగి. ఆ ప్యాకెట్స్ అక్కడే పెట్టి, టెన్ మినిట్స్‌లో వస్తానని, స్టేషన్‌కేసి పరుగు తీశా..." అందరూ ఉత్కంఠగా వింటున్నారు.

"...నేనెక్కిన ట్రైన్ బోరివిలీ వెళ్ళి తిరిగి మాలాడ్ వచ్చేసరికి ఇరవై అయిదు నిమిషాలు పడుతుంది. రెండవ నెంబరు ప్లాట్‌ఫాం చేరేసరికి మరో మూడు నిమిషాల్లో రైలుందని ఇండికేటరు సూచిస్తోంది. నేనెక్కిన ట్రైన్ అదేనేమో? అయినా అందులో నా బ్యాగుంటుందా? ఉన్నా దాంట్లో వస్తువులన్నీ ఉంటాయా? ఎవరైనా కొట్టేసుంటారా? టెన్షన్! ముంబాయిలో బాంబ్‌బ్లాస్ట్‌లు జరిగాక అపరిచిత వస్తువులను తాకరాదని, వాటి విషయం రైల్వే సిబ్బందికి తెలియజేయమని స్టేషన్లలో, టి.వి.లో, రేడియోలో అనౌన్స్ చేస్తున్నారు. బోరీవలీ స్టేషన్లో, నా పౌచ్ గురించి రిపోర్ట్ చేసుంటారా? వారి చేతిలో పడితే అది తిరిగి తీసుకోవాలంటే అదో యజ్ఞం. అదలా తిరిగి దొరికినా అందులోని వస్తువులు అన్నీ ఉంటాయా? ప్రశ్నలు.. ప్రశ్నలు.. అంతలో ట్రైన్ వచ్చి ఆగింది. ఫస్ట్‌క్లాస్ పెట్టెలోకి దూరి వెతికాను. నా పౌచ్ కనిపించలేదు. నిరాశతో దిగిపోయాను."

తాగడం కూడా మరచి, ఒక సస్పెన్స్ సినిమా చూస్తున్నంత ఉత్సుకతతో వింటున్నారు అందరూ. ఒక సిప్ తీసుకుని కొనసాగించాడు మూర్తి.

"ప్లాట్‌ఫాం నెంబరు నాలుగులో చర్చిగేట్ వైపు వెళ్ళే రైలుందని ఇండికేటర్లో చూశాను.

అదే నేనెక్కిన ట్రైనేమో? దానికీ ఇక్కడ రాబోయే రైలుకి రెండు నిమిషాలే తేడా. ఇదే నేను ఎక్కిన ట్రైనయితే? రెండు రైళ్ళు చూడడం అసాధ్యం. ఏమైతేనేం ఇక్కడే ఉంటానని, రెండవ నెంబరు ప్లాట్‌ఫాంలోనే ఉన్నాను.

చేతులు నలుపుకుంటూ అటూ ఇటూ తిరుగుతున్నాను. మనసంతా గజిబిజిగా ఉంది. సరిగ్గా ఇంకో మూడు నిమిషాలకు ప్లాట్‌ఫాం మీద ఇంకో బండి ఆగింది."

మూర్తి ఆపి, డ్రింక్ మరో గుక్క తాగి, ఆలూ చిప్స్ అందుకున్నాడు.

"నీ ఇంటర్వెల్ తగలెయ్యా? ప్రాణాలు తీసేస్తున్నావ్" కుమార్ తానూ గ్లాసందుకుని అన్నాడు.

"కానీయవయ్యా" అన్నారు మిగతా ఇద్దరు.

"ఒక్క ఉదుటున కంపార్ట్‌మెంట్‌లోకి దూకాను. పైన చూస్తే...! నా పౌచ్! నేను పెట్టిన చోటే సురక్షితంగా ఉంది. అది గట్టిగా గుండెకు హత్తుకుని రైలు దిగాను. తెరచి చూస్తే? నా వస్తువులు? చెక్కు చెదరకుండా ఉన్నాయి."

"ఎంత రచయితవైతే మాత్రం ఇలా చెప్పాలా?" నిష్ఠూరమాడాడు స్వామి.

"కథింకా పూర్తి కాలేదు."

"ఇంకా నీ సొద వినాలా" విసుక్కున్నాడు కుమార్.

"నో మూర్తీ... కంటిన్యూ చేయి" కోరస్‌గా అన్నారు రెడ్డి, స్వామి.

కుమార్ మరో పెద్దపెగ్ తీసుకున్నాడు. చేతిలోది పూర్తిచేసి మరో స్మాల్‌తోపాటు, తన కథనం సాగించాడు మూర్తి.

"మస్కట్ నుండి ఆరోజు ఫోన్, నా ఫ్రెండు రవి బొంబాయి వస్తున్నాడు. రెండు రోజులు నాతో ఉండి హైదాబ్రాద్ వెళతాడు. అదీ అతని ప్రోగ్రాం. హైదరాబాద్‌కి డైరెక్ట్ టిక్కెట్టు దొరకకపోవడంవల్ల ముంబాయి-హైద్రాబాద్ ఫ్లైట్ టిక్కెట్ బుక్ చేయమన్నాడు.

అతన్ని విమానాశ్రయంలో రిసీవ్ చేసుకుని ఇంటికి తీసుకువచ్చాను. భోజనాలు చేసి, కాసేపు రెస్ట్ తీసుకుని, మాలాడ్ స్టేషన్ వైపు బయలుదేరాం. కారుని ట్రావెల్ ఏజెంట్ ఆఫీసు దగ్గరాపి టిక్కెట్ తీసుకున్నాం. స్టేషన్ దగ్గర పార్కింగ్ దొరకదు కాబట్టి కారునక్కడే వదిలాం. కావలసిన వస్తువులు కొనుక్కుని చూసేసరికి సేమ్ ప్రాబ్లెం. చేతిలో బ్యాగు లేదు. జేబులో కారుతాళాలు కూడా లేవు. మాటల్లోపడి కారుకి తాళం వేయలేదు. పరుగులాంటి నడకతో కారు దగ్గరికి వచ్చాను.

కారు అలాగే ఉంది. విండో గ్లాసెస్ తెరిచే ఉన్నాయి. ఇగ్నిషన్‌కి తాళాలున్నాయి. అన్నిటికి మించి వెనక సీట్లో నా పౌచ్ సురక్షితంగా ఉంది. దానిలోని అన్ని వస్తువులూ ఉన్నాయి.

అప్పటి నుంచి అది నా లక్కీ పౌచ్" అని లేచి వెళ్లి ఆ బ్యాగు తీసుకొచ్చాడు మూర్తి. స్వామి దాన్నందుకుని ముద్దు పెట్టుకున్నాడు. రెడ్డి నవ్వాడు మత్తుగా.

అప్పటికే నాలుగో రౌండ్ పూర్తి చేసిన కుమార్ మాట్లాడే స్థితిలో లేడు. అయినా "ట్రాష్" అని గొణిగి సోఫాలో వాలిపోయాడు.

"మిత్రమా! ఎవరి సెంటిమెంటు వారిది. అది ఇతరులకు చాదస్తంగా అనిపించవచ్చు. దానికి మనమేం చేయలేం." అని భుజాలెగరేశాడు మూర్తి. కథ కంచికి, మనం?

★